
సాక్షి గుంటూరు

గురువారం, 25, సెప్టెంబర్, 2025



సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలి

పిడుగురాళ్ల: సోలార్ విద్యుత్ ప్యానెల్స్‌ను ప్రతి ఒక్కరు ఏర్పాటు చేయించుకోవాలని పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ సూపరిటెండెంట్ ఇంజనీర్ డాక్టర్ పి. విజయ్‌కుమార్ సూచించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,68,435 క్యూసెక్కులు వచ్చి చేరు తోంది. ప్రాజెక్టు దిగువకు 3,82,670 క్యూసెక్కులు వదులుతున్నారు.



పర్యాటక కేంద్రాల సందర్శన

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ పరిధిలోని పర్యాటక ప్రాంతాలను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం సందర్శించారు. ఉద్యోగులతో మాట్లాడారు.

న్యూస్‌రీల్

నేడు ఫార్మాసిస్టుల ర్యాలీ

గుంటూరు మెడికల్: ప్రపంచ ఫార్మాసిస్టు దినోత్సవం పురస్కరించుకుని ఈనెల 25న గుంటూరు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఏపీ ఫార్మాసిస్ట్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ వి.మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ గుంటూరు జీజీహెచ్ నుంచి ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. మార్కెట్ సెంటర్ మీదుగా జిల్లాపరిషత్ సమావేశ మందిరం వరకు జరుగుతుందన్నారు. ర్యాలీ అనంతరం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర, జిల్లా స్థాయి ఫార్మసీ ఆఫీసర్ల సమావేశం జరుగుతుందన్నారు. జిల్లాలోని ఫార్మాసిస్టులందరూ ఈ ర్యాలీకి హాజరవ్వాలని ఆయన కోరారు.

పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు వెస్ట్: ప్రకాశం బ్యారేజీ ఎగువ నుంచి 4.5 లక్షల క్యూసెక్కులు కృష్ణా నదికి విడుదల చేసే అవకాశముందని కలెక్టర్ కార్యాలయ వర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో నది పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల, కొల్లిపర ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. సహాయక చర్యలు కోసం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్ 0863- 2234014ను సంప్రదించాలని సూచించారు.

శింగరకొండ ఆలయ పాలక మండలి నియామకం



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నూతన పాల మండలిని నియమించారు. అధ్యక్షుడుగా చుండూరి మురళీ సుధాకరరావుతో పాటు సభ్యులుగా ఆకుల కోటేశ్వరరావు, బత్తుల చంద్రశేఖర్, నూతి లక్ష్మీ ప్రసాద్, మందా సునీత, ఏల్చూరి వెంకట నారాయణమ్మ, ధూళిపాళ్ల వెంకటరత్నం, గొర్రెపాటి పద్మజ, హరబోలు నాగమ్మ, దేవరపల్లి సురేష్‌బాబు, కొనంకి సుబ్బారావు నియమితులయ్యారు.

పల్నాడు జిల్లా మత్స్యశాఖ అధికారిగా వెంకట్రావు



నరసరావుపేటరూరల్: జిల్లా మత్స్యశాఖ అధికారిగా ఐ.వెంకట్రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వెంకట్రావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలు జారీ చేశారు. గతంలో మత్స్యశాఖ జిల్లా అధికారిగా పనిచేసిన సంజీవరావుపై ఆరోపణలు రావడంతో ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఈనెల 11న అప్పటి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుత కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు వెంకట్రావు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

సాంకేతికత వినియోగంతో లాభసాటి వ్యవసాయం



బెల్లంకొండ: రైతులు సాగులో ప్రకృతి వ్యవసాయ విధానం, సాంకేతికతను వినియోగించడం ద్వారా లాభసాటిగా మార్చుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగవుతున్న వరి పంటలను పరిశీలించారు. రైతులు కూలీల కొరతతో మందులు, కషాయాల పిచికారీలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రోన్ పరికరాలను అందుబాటులో తీసుకువచ్చిందని పేర్కొన్నారు. డ్రోన్ల ద్వారా తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో సహజ ద్రావణాలను విస్తృతంగా పిచికారీ చేయవచ్చని తెలిపారు. సబ్సిడీ ద్వారా అందించే డ్రోన్ల వినియోగాన్ని రైతులకు వివరించారు. ఘన, ద్రవ జీవామృతం, దశపర్ణి కషాయం, నీమాస్త్రం వంటి కషాయాలను కూడా పిచికారీ చేయవచ్చని తెలిపారు.

ఈ నగరానికి ఏమైంది?

- అంతం కాని డయేరియా భూతం
- అదుపులోకి రాని వ్యాధి
- ప్రతిరోజూ జీజీహెచ్‌లో బాధితుల చేరిక
- రాత్రి సమయాల్లో ఎక్కువగా రాక
- 165 మందికి పైగా బాధితులకు చికిత్స
- కట్టడి చేయడంలో విఫలమవుతున్న అధికారులు



గుంటూరు జీజీహెచ్‌లోని డయేరియా వార్డు

గుంటూరు మెడికల్: డయేరియా భూతం గుంటూరు నగరాన్ని పట్టి పీడిస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పది రోజులుగా నగరంలో వాంతులు, విరేచనాల కేసులు నమోదవుతూనే ఉన్నాయి. నిత్యం పెద్ద సంఖ్యలో బాధితులు చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కి వస్తున్నారు. వ్యాధిని కట్టడి చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

కలరా భయంతో వణుకు

ఓ పక్క డయేరియాతో వణికిపోతున్న నగర ప్రజానీకానికి మరోపక్క కలరా భయం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అధికారుల గణాంకాల ప్రకారం గుంటూరు నగరానికి చెందిన ముగ్గురు కలరాతో జీజీహెచ్‌లో చికిత్స పొంది, డిశ్చార్జి అయ్యారు. అయితే, పూర్తి స్థాయిలో నివేదికలు బయటకు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవ పరిస్థితులను కూడా అధికారులు దాస్తున్నారు. డయేరియా, కలరా బాధితుల గణాంకాలను వివరించేందుకు ముందుకు రావడం లేదు.ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందనే కారణాలతో సాధ్యమైనంత మేరకు గణాంకాలను దాచి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. వివరాలు చెబితే వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయనే భయంతో అన్ని శాఖల వారు మౌనంగా ఉంటున్నారు.

పత్తాలేని ఆసుపత్రి అధికారులు

- రాత్రి సమయాల్లో జీజీహెచ్‌లో అందుబాటులో ఉండి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాల్సిన ఆసుపత్రి అధికారులు ఉండటం లేదన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.
- డ్యూటీ అసిస్టెంట్ ఫిజీషియన్ (డీఏపీ), డ్యూటీ అసిస్టెంట్ సర్జన్ (డీఏఎస్)లు క్యాజువాలిటీలో అందుబాటులో ఉండటం లేదు.
- విధుల్లో ఉన్నారా? రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా ? అనే విషయాలు పర్యవేక్షించాల్సిన సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్, డెప్యూటీ సివిల్ సర్జన్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు విధులను మరిచారు.
- రాత్రి వేళల్లో క్యాజువాలిటీలో తనిఖీలు చేయడం, మెరుగైన చికిత్సలు అందేలా చూడాల్సిన సీఎస్ ఆర్ఎంఓ, డెప్యూటీ సీఎస్ఆర్ఎంఓ ఆసుపత్రుల్లో ఉండటం లేదు.
- డ్యూటీలను అసిస్టెంట్ ఆర్ఎంఓల పేరుతో క్యాజువాల్టీ మెడికల్ ఆఫీసర్‌లకు కేటాయించి, వాళ్లు ఇళ్ల వద్దే ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- నిబంధనల ప్రకారం సీఎస్ఆర్ఎంఓ, డెప్యూటీ సీఎస్ఆర్ఎంఓ తప్పనిసరిగా ఆసుపత్రిలోనే నివాసం ఉండి, రాత్రి వేళల్లో తనిఖీలు చేస్తూ రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలి.
- ఓ పక్క అధిక సంఖ్యలో డయేరియా కేసులు వస్తున్నా ముఖ్యమైన అధికారులు ఆసుపత్రిలో ఉండకుండా విధులకు డుమ్మా కొట్టడం విమర్శలకు తావిస్తోంది.

వ్యాధి కట్టడి కీలకం

సాధారణంగా డయేరియా, కలరా లాంటి వ్యాధులు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను ముందస్తుగా అధికారులు అప్రమత్తం చేయాలి. వ్యక్తిగతంతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ఈ వ్యాధుల కట్టడిలో కీలకం. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదు. మురుగు కాలువల్లో తాగునీటి పైప్‌లైన్లు ఇంకా మునిగే ఉన్నాయి. గతంలో జరిగిన ప్రాణ నష్టం నుంచి అధికారులు గుణపాఠాలు నేర్చుకోవడం లేదు. విధుల నిర్వహణలో నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నారు.

ఏ మాత్రం తగ్గని డయేరియా

ఈనెల 15న గుంటూరు జీజీహెచ్‌లో మొట్టమొదటిసారిగా డయేరియా బాధితులు అడ్మిట్ అయ్యారు. నాటి నుంచి ప్రతిరోజూ చికిత్స కోసం వస్తూనే ఉన్నారు. ఇటీవల కలరా కలకలం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. ఒకవైపు డయేరియా, మరోవైపు కలరాతో ఈ నగరానికి ఏమైందంటూ మేధావులు సైతం పెదవి విరుస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ఇప్పటి వరకు 165 మందికి పైగా డయేరియాతో చికిత్స పొందారు. వీరిలో ఆరోగ్యం కుదుటపడిన సుమారు 80 మందిని డిశ్చార్జి చేశారు. వాంతులు, విరేచనాలు ఎక్కువగా అవడంతో కిడ్నీల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న ముగ్గురిని ఐసీయూలో అడ్మిషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. తొలుత డయేరియా బాధితుల కోసం ఇన్‌పేషెంట్ విభాగంలోని జనరల్ సర్జరీ విభాగం 333 నంబరును కేటాయించారు. బాధితుల సంఖ్య ఎక్కువగా ఉండటం, ప్రతిరోజూ అడ్మిషన్లు రావడంతో ఆర్థోపెడిక్ విభాగంలోని పేరాప్లీజియా, ఇతర సర్జరీ వార్డులను కేటాయించారు.

రాత్రి అయితే కంటి మీద కునుకు కరువు

ముఖ్యంగా రాత్రి సమయాల్లో బాధితులు చికిత్స కోసం ఆసుపత్రులకు వెళుతున్నారు. పగలంతా ఇళ్ల వద్దే ఉన్నా వాంతులు, విరేచనాలు కట్టడి కాకపోవడంతో రాత్రి సమయాల్లో జీజీహెచ్‌కి వెళుతున్నట్లు బాధితులు, వారి కుటుంబ సభ్యులు తెలియజేస్తున్నారు. ప్రతిరోజూ రాత్రి పది గంటల వరకు కేసులు అడ్మిట్ అవుతున్నాయి. చికిత్స కోసం బాధితులను తీసుకెళ్లే కుటుంబ సభ్యులకు, ఆసుపత్రిలో ఉన్న వైద్యులు, సిబ్బందికి సైతం రాత్రి అయితే కంటి మీద కునుకు లేకుండా పోతోంది.

సమన్వయంతో వ్యాధులను అరికట్టాలి

కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో బుధవారం నగరపాల సంస్థ కమిషనర్ పులి శ్రీనివాస్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నగరపాలక సంస్థ పరిధిలో సీజనల్ వ్యాధులు నియంత్రణకు వైద్య, ఆరోగ్య, మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ అధికారులు కృషి చేయాలని ఆమె చెప్పారు. డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో నియమించిన జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేయాలని ఆమె తెలిపారు. పాత గుంటూరులో డయేరియా కేసులు నమోదవుతున్న తొమ్మిది సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టితో ముందస్తు నివారణ చర్యలను అమలు చేయాలని ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకోవాలని తెలిపారు. అనారోగ్య లక్షణాలు ఉన్నవారిని వెంటనే వైద్య శిబిరాలకు తరలించి చికిత్స అందించాలని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గురువారం ఉదయం నాటికి పూర్తిస్థాయిలో ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులతో అవసరం మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు లేని దుకాణాలను వెంటనే మూయించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, జిల్లా వైద్య శాఖ అధికారి విజయలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ యశస్వి, జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఎస్ఈ కల్యాణ్ చక్రవర్తి, నగరపాలక సంస్థ సీఎంహెచ్ఓ శోభారాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు

అన్నపూర్ణాదేవిగా భ్రమరాంబ దర్శనం



పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను అనుగ్రహించారు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామున సుప్రభాతసేవతో పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ యాగశాలలో నిర్వహించిన చండీ హోమం , రుద్ర పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విజయకీలాద్రిపై వీరలక్ష్మి అలంకారం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం రెండవ రోజుకు చేరాయి. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనాలతో రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా అమ్మవారు వీరలక్ష్మిగా దర్శనమిచ్చారని తెలిపారు. ఉదయం 9 గంటలకు తిరుమంజనం అలంకరణ, భక్తులతో సామూహిక కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించామని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు వీరలక్ష్మి అమ్మవారికి పల్లకీ సేవ, అర్చన, స్వామి వారి మంగళా శాసనాలతో కార్యక్రమాలు ఘనంగా ముగిశాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో వీరలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలియజేశారు.

గాయత్రీ దేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: ప్రముఖ శైవక్షేత్రం అమరావతి బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీ దేవీ శరన్నవ రాత్ర్యుత్సవాలలో భాగంగా బుధవారం బాలచాముండేశ్వరి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో మూడో రోజు సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీ చక్రార్చనతోపాటుగా గాయత్రీదేవికి సంధ్యా సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్దిని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాల్లో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

అన్న ప్రసాదిని..అభయ ప్రదాయిని

- మూడో రోజూ ఇంద్రకీలాద్రిపై అదే రద్దీ
- తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ కొనసాగిన వైనం
- అన్న ప్రసాద స్వీకరణకు భక్తుల బారులు
- నేడు కాత్యాయనీదేవిగా దుర్గమ్మ దర్శనం



దుర్గమ్మ దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో మూడో రోజైన బుధవారం దుర్గమ్మ శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని శ్రీఅన్నపూర్ణాదేవిగా దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలు, బాలభోగం నివేదన అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సర్వ దర్శనం మూడు క్యూలైన్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగుతూనే ఉంది. సాయంత్రం అమ్మవారి మహా నివేదన, పంచహారతుల తర్వాత భక్తుల రద్దీ మరింత పెరిగింది. కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడితో పాటు కుమ్మరిపాలెం వైపు క్యూలైన్లు రద్దీగా కనిపించాయి.

సర్వ దర్శనం క్యూలైన్లలో రద్దీ

బుధవారం తెల్లవారుజాము నుంచి సర్వ దర్శనం క్యూలైన్లలో భక్తుల రద్దీ కొనసాగింది. సాధారణ భక్తులతో పాటు భవానీ దీక్షలు స్వీకరించిన భక్తులు క్యూలైన్‌లో ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే ఉపవాసంతో ఉండే భవానీలకు ప్రత్యేక ఏర్పాటు చేయకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటకలకు చెందిన భక్తులు దీక్షలను స్వీకరించి దర్శనానికి వచ్చారు. తెల్లవారుజాము నుంచి రాత్రి 11 గంటల వరకు సర్వ దర్శనం క్యూలైన్‌లో రద్దీ ఏకధాటిగా కొనసాగుతూనే ఉంది.

వీఐపీ క్యూలైన్‌లో అనుమతి..

సేవా బృంద సభ్యులు, పోలీసు సిబ్బంది ఎవరైనా వీఐపీ క్యూలైన్ ద్వారానే అమ్మవారి దర్శనం చేసుకోవాలని ఈవో శీనానాయక్, ఏడీసీపీ జి.రామకృష్ణ సూచించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని స్కానింగ్ పాయింట్, మీడియా పాయింట్ల వద్ద పలుమార్లు తనిఖీలు నిర్వహించారు. సిఫార్సులతో దర్శనం కోసం నేరుగా వస్తున్న వారిని ఆపి కార్డులు తనిఖీలు చేశారు. దీంతో చిన్న గాలిగోపురం పరిసరాల్లో, సీఎం గేటు వద్ద రద్దీ అదుపులోకి వచ్చింది.

అన్నదాన భవనంలో తనిఖీలు..

అమ్మవారి అన్నప్రసాదం కోసం తరలివచ్చిన భక్తులతో మహా మండపం ఎదుట నూతనంగా నిర్మించిన అన్నదాన భవనం కిటకిటలాడింది. మరో వైపున అన్న ప్రసాద నాణ్యతలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్‌కలెక్టర్ ఎస్. ఇలక్కియ వేరు వేరుగా తనిఖీలు నిర్వహించారు.


మూడో రోజు ఆదాయం రూ.31.08లక్షలు

దసరా ఉత్సవాలలో మూడో రోజైన బుధవారం దేవస్థానానికి రూ. 31.08 లక్షల మేర ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. రూ. 300 టికెట్ల విక్రయం ద్వారా రూ.10.56లక్షలు, రూ.100 టికెట్ల విక్రయం ద్వారా రూ.3.46లక్షలు, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ. 2.98లక్షలు, ఆరు లడ్డూ బాక్స్‌ల విక్రయం ద్వారా రూ.11.89లక్షలు, ఆర్జిత సేవా టికెట్ల విక్రయం, సేవల ద్వారా రూ.2.10 లక్షల మేర ఆదాయం లభించిందని పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటల వరకు 58 వేల మంది అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా దర్శించుకున్నారని, అన్నప్రసాదం 22,506 మందికి పంపిణీ చేశామని పేర్కొన్నారు.

ఇంద్రకీలాద్రిపై నేడు..

- గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 7 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం (యాగశాల)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన(లక్ష కుంకుమార్చన వేదిక)
- సాయంత్రం 5 గంటలకు శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి నగరోత్సవ సేవ
- సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి మహా నివేదన, పంచహారతుల సేవ, వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

నేటి అలంకారం శ్రీ కాత్యాయనీ దేవి



ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు దుర్గమ్మ శ్రీ కాత్యాయనీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. పూర్వం కత అనే మహర్షికి దేవీ ఉపాసన వల్ల ఒక కుమారుడు కలిగాడు. చిన్నతనం నుంచే తండ్రి నుంచి భక్తిని అలవర్చుకున్న ఆ తపస్వికి కాత్యాయనుడు అనే పేరు. ఇతను దేవీ భక్తుడు అవ్వడంతో దేవినే పుత్రికగా పొందదలచి గొప్ప తపస్సు చేశాడు. దేవీ ప్రసన్నురాలై మహర్షికి పుత్రికగా జన్మించింది. కాత్యాయనుడి పుత్రిక కనుక ఆ తల్లిని కాత్యాయనీదేవిగా కొలుస్తారు.

కృష్ణమ్మ ఉగ్రరూపం



కొల్లూరు: కృష్ణమ్మ ఉగ్రరూపంతో నదీ పరీవాహక లంక గ్రామాలు చిగురుటాకులా వణుకుతున్నాయి. గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. వరద తీవ్రత అంతకంతకూ పెరుగుతుండటంతో పంట పొలాల్లోకి నీరు వచ్చి చేరుతోంది. వాణిజ్య పంటలు ముంపు బారిన పడుతున్నాయి. బుధవారం ప్రకాశం బ్యారేజ్ నుంచి 4.44 లక్షల క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడుదల చేయడంతో నదిలో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. నది ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల్ని వరద నీరు ముంచెత్తింది. మండలంలోని పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాల చుట్టూ ఇటుకరాయి తయారీకి అవసరమైన మట్టి కోసం తవ్విన భారీ గుంతల్లోకి నీరు చేరింది. చింతర్లంక, గాజుల్లంక, పోతార్లంక, దోనేపూడి కరకట్ట దిగువు ప్రాంతాల్లో వాణిజ్య పంటలకు నష్టం వాటిల్లింది. పంట భూములలోకి వరద నీరు ప్రవేశించింది. అరటి, కంద, కూరగాయలు, పసుపు, మినుము పంటలు ముంపు బారిన పడ్డాయి. ప్రకాశం బ్యారేజ్ నుంచి వరద నీటి ప్రవాహం క్రమక్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఇంచుమించు 6.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు సముద్రంలోకి వదిలే అవకాశాలున్నట్లు అధికారులు ముందస్తు హెచ్చరికలు చేస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. వరద తీవ్రత పెరిగిన పక్షంలో ప్రజలను తరలించడానికి అవసరమైన ఏర్పాట్లతో పాటు మండలంలో 13 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 2,400

మోడల్ ధర రూ. 2,800

పసుపు ధరలు (బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 457

కొమ్ములు : 365 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,000	10,560	10,560

కాయలు : 92 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,025	10,200	10,200

మొత్తం అమ్మకాలు : 342.75 క్వింటాళ్లు

మిర్చి యార్డు సమాచారం (బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	33,605
అమ్మకాలు	31,926
నిల్వ	10,473

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,300
నంబరు–5	10,000–14,000
341	10,000–15,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,500
నంబరు–5	10,000–14,200
341	10,000–15,200
4884	10,000–13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,500
బాడిగ–355	10,000 – 14,800
దేవనూరు డీలక్స్	10,000 – 14,000
ఆర్మూర్	9,800 – 12,000
తాలుకాయలు	6,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,700
బాడిగ – 355	10,000–14,900
దేవనూరు డీలక్స్	10,500–14,000
తాలు	5,200 – 6,500

–కొరిటిపాడు (గుంటూరు)

ట్యాంకులు ఇలా.. ఆరోగ్యం ఎలా?

- గుంటూరు నగరంలో శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు
- పై కప్పులు ఊడిపోయి అధ్వానం
- ట్యాంకుల్లో పక్షుల వ్యర్థాలు
- వీటి ద్వారానే నగరానికి తాగునీటి సరఫరా
- ప్రస్తుతం నగరంలో డయేరియా బారిన పడి 80 మంది చికిత్స పొందుతున్న పరిస్థితి



బీఆర్ స్టేడియంలో వాటర్ ట్యాంకు పై కప్పు పూర్తిగా లేని దృశ్యం

నెహ్రూనగర్: గుంటూరు నగరానికి తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి నగరంలోని పలు వాటర్ ట్యాంకులకు నీటి సరఫరా అయి అక్కడ నుంచి పైపులు ద్వారా ఇంటింటికి తాగునీటి సరఫరా జరుగుతుంది. అయితే నగరంలో ఉన్న పలు వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరడంతో పాటు పై కప్పులు ఊడిపోవడంతో అధ్వానంగా మారాయి. వీటి ద్వారానే తాగునీటి సరఫరా జరుగుతుండటంతో నగర వాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

శిథిలావస్థలో ఏడు ట్యాంకులు..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 62 వాటర్ ట్యాంకులు ఉన్నాయి (వీటిల్లో 42 ట్యాంకులు నగర పరిధిలో, మిగిలిన విలీన గ్రామాలకు చెందినవి). అయితే ఈ 42 వాటర్ ట్యాంకుల్లో 7 ప్రాంతాల్లోని 9 వాటర్ ట్యాంకులకు పై కప్పులు ఊడిపోయి అధ్వానంగా మారాయి. బీఆర్ స్టేడియం, నల్లచెరువు, ఏటీ అగ్రహారం, స్తంభాలగరువు, శారదాకాలనీ, వసంతరాయపురం, నెహ్రూనగర్ రిజార్వయర్లలో ఉన్న వాటర్ ట్యాంకులకు ఉన్న పై కప్పులు సక్రమంగా లేకపోవడంతో వాటిలో పక్షుల వ్యర్థాలు పడుతున్నాయి. ఈ నీటినే అధికారులు నగరంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. 2018లో బీఆర్ స్టేడియం పరిధిలోని ఆనంద్‌పేటలో 30కి మందికిపైగా డయేరియా బారిన పడి మృతిచెందిన విషయం తెలిసిందే. అప్పుడు హడావుడిగా పాడైపోయిన వాటర్ ట్యాంకులను కవర్ చేస్తూ మరమ్మతులు చేపట్టారు. కాలక్రమేనా అవి కూడా పాడైపోవడంతో వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. తీరా ఇప్పుడు అదే ప్రాంతంలో డయేరియా కేసులు నమోదవుతున్నాయి.



బీఆర్ స్టేడియంలో మరో ట్యాంకుపైన ఉన్న రంధ్రాలు

ప్రస్తుతం యాక్టివ్‌గా 80 కేసులు..

గుంటూరు నగర పరిధిలో ఇప్పటివరకు 160 మంది జీజీహెచ్‌లో డయేరియాతో బారిన చికిత్స పొందుతున్నారు. వీరిలో 80 మంది డిశ్చార్జి అవ్వగా..ఇంకా 80 మంది చికిత్స పొందుతున్నారు. అదే విధంగా ఈకోలి బ్యాక్టీరియా కారణంగా కలరా వ్యాప్తి చెంది 3 కేసులు నమోదవగా.. వారు చికిత్స తీసుకుని డిచార్జ్ అయ్యారు. ప్రభావిత ప్రాంతాల్లో జిల్లాస్థాయి అధికారులను ఒక్కో వార్డుకు ఒక్కో అధికారిని నియమించి, వారికి డయేరియాపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టారు.

నెలకోసారి సైతం శుభ్రం చేయని వైనం

గుంటూరు నగరంలో ఉన్న 42 వాటర్ ట్యాంకులను నెలకొక సారి శుభ్రం చేయాల్సి ఉంది. కా తీ ఇందులో చాలా ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయడం లేదని గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికి ఇంకా ఈ నెలలో 10 ట్యాంకులను శుభ్రం చేయలేదని వారు చెబుతున్నారు. తాగునీటి సరఫరాపై అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై నగర వాసులు పాలకులు, అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

తక్కెళ్లపాడు నుంచి సరఫరా చేయాలి



గుంటూరు నగరంలో 7 ప్రాంతాల్లో ఉన్న వాటర్ ట్యాంకులు శిథిలావస్థలో పై కప్పులు ఊడిపోయి ఉన్నాయి. 42 వాటర్ ట్యాంకులు నగర పరిధిలో ఉంటే వీటిల్లో 10 ట్యాంకులను ఇంకా శుభ్రం చేయలేదు. డయేరియా ప్రభావిత ప్రాంతాలకు ఆయా పాడైన వాటర్ ట్యాంకుల నుంచే వాటర్ సప్లయి చేస్తే ప్రయోజనం ఏం ఉండదు. తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ నుంచితాగునీరు సరఫరా చేయాలి.

– నారాయణరెడ్డి, గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి



గుంటూరు మెడికల్: జిల్లాలో ప్రస్తుతం ప్రబలిన డయేరియా పరిస్థితి రీత్యా డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీల సంఘనేతలతో బుధవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం పంపిణీ తప్ప తమ పరిధికి మించి చికిత్స చేయకూడదన్నారు. సెలైన్లు ఎక్కించడం, మందులు ఇవ్వడం వంటివి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు, డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, ఆరోగ్య విస్తరణ అధికారి నూనె రామకృష్ణ, సూపర్‌వైజర్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

3,202 గృహాలు సర్వే ..

అతిసార ప్రభావిత ప్రాంతాల్లో 50 బృందాలు 3202 గృహాలను సర్వే చేసిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం తెలిపారు. అతిసార నివారణకు తీసుకున్న చర్యలు వివరించారు. నోడల్ అధికారులుగా నియమితులైన జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించి తీసుకోవలసిన చర్యలు పై ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. జీజీహెచ్‌లో సెప్టెంబర్ 17 నుంచి ఇప్పటి వరకూ 185 కేసులు రిపోర్ట్ కాగా, 104 మంది బెడ్ మీద ఉన్నారని, 81 మంది డిశ్చార్జ్ అయ్యారని, కొత్తగా చేరిన వారిలో 8 కేసులు డిశ్చార్జ్ అయ్యారని, 23, 24 తేదీల్లో 17 కేసులు వచ్చాయని తెలిపారు. 168 నమూనాలు సేకరించగా 13 పాజిటివ్ వచ్చాయని, వాటిలో విబ్రియో 3, సిగెల్లి 1, ఇ – కోలి 9 కేసులు ఉన్నాయన్నారు.

ఆరు మండలాల్లో వర్షం

కొరిటిపాడు(గుంటూరు): జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 15.4 మిల్లీమీటర్లు పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 1.6 మి.మీ. పడింది.

కేఎల్‌యూ ప్రొఫెసర్లకు ప్రపంచ శాస్త్రవేత్తలుగా గుర్తింపు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ అగ్రశ్రేణి శాస్త్రవేత్తలుగా కేఎల్‌యూ ప్రొఫెసర్లకు గుర్తింపు లభించింది. ప్రపంచ ప్రఖ్యాత అమెరికా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ఎల్సెవియర్ డేటాబేస్ విడుదల చేసిన జాబితాలో 20 మంది కేఎల్‌యూ ప్రొఫెసర్లు ఉన్నారు. తమ అధ్యాపక బృందంలో 20 మంది ప్రపంచంలోని అత్యున్నత రెండు శాతం శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందారని ప్రకటించడానికి గర్వంగా ఉందని కేఎల్‌యూ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ తెలిపారు. విజయవాడ మ్యూజియం రోడ్డులోని సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణలతో సమాజానికి ఉపయోగపడే విధంగా ముందుకు సాగుతామన్నారు. ఉత్తమ ర్యాంకింగ్‌ను సాధించినందుకు డాక్టర్ బి.టి.పి.మాధవ్, డాక్టర్ సంతోష్ కుమార్, డాక్టర్ ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ రాగిణి సింగ్, డాక్టర్ గంధర్వ్ స్త్వైన్, డాక్టర్ ఎం.జానకి రామయ్యను ప్రత్యేకంగా ప్రశంసించారు. డాక్టర్ హసనే అహమ్మద్, డాక్టర్ ఎస్ షణ్ముగస్, డాక్టర్ జియా ఉర్ రెహమాన్, డాక్టర్ డి.వెంకటరత్నం, డాక్టర్ అర్పిత్ జైన్, డాక్టర్‌సంతోష్, డాక్టర్ మొహమూద, డాక్టర్ అతుల్ కుమార్, డాక్టర్ ఎస్.ఆర్.ఆర్.రెడ్డి, డాక్టర్ బి.ఉషారాణి, డాక్టర్ ప్రియా రంజన్ సమల్, డాక్టర్ అతుల్ భట్టాడ్‌ను టాప్ టూ జాబితాలో ప్రకటించిన సందర్భంగా అభినందించారు.

ముగిసిన చేతిరాత శిక్షణ శిబిరం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: అందమైన చేతిరాత అదృష్టమని, అది ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు మున్నంగి సంజీవరెడ్డి తెలిపారు. శ్రీమతి చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చేతిరాత శిక్షణ శిబిరం బుధవారంతో ముగసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సంజీవరెడ్డి మాట్లాడుతూ అందమైన చేతిరాత వలన విద్యార్థులు పరీక్షల్లో అదనంగా మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. జాతీయ అవార్డు గ్రహీత వి.రామమోహనరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 వేల మంది విద్యార్థులు, 15 వేల మంది ఉపాధ్యాయులు చేతిరాతలో శిక్షణ పొందారన్నారు. వీర గంగాధర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చైల్డ్ లైన్ వెల్ఫేర్ బోర్డు రిటైర్డ్ అధికారి ప్రసాదలింగం మాట్లాడుతూ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా శిక్షణ పొందటం అమూల్యమైనదని ప్రశంసించారు. రిటైర్డ్ ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి, విద్యార్థులకు అందిస్తున్న సేవలు గొప్పవని కొనియాడారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించిన అనంతరం చేతిరాతలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేశారు.

నకిలీ సర్టిఫికెట్ కేసులో రెండేళ్ల జైలు

గుంటూరు లీగల్: నకిలీ సర్టిఫికెట్ ఇచ్చిన కేసులో నిందితుడికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ గుంటూరు ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బుధవారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే.. 2019లో ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి పోతమరాజు వెంకట శివరామ కృష్ణారావు బాధితుడైన మేకల రవికుమార్‌కు నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చాడు. అయితే డిపార్టుమెంట్ అధికారుల తనిఖీల్లో అది నకిలీ ఆర్డర్ అని గుర్తించారు. ఈమేరకు సెక్షన్ 420, 468, 471 ఐపీసీ సెక్షన్ల కింద ఒకటో నిందితుడిగా మేకల రవికుమార్‌ను, రెండో నిందితుడిగా పోతమరాజు వెంకట శివరామ కృష్ణారావును చేర్చి, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వాద ప్రతివాదనల విన్న ఆరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ రెండో నిందితుడైన పోతమరాజు వెంకట శివరామ కృష్ణారావుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించి రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఒకటో నిందితుడు మేకల రవికుమార్‌ను నిర్దోషిగా తీర్పు చెప్పారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీకృష్ణ వాదనలు వినిపించినారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

ఎయిమ్స్‌లో కలరా రోగులను పరామర్శించిన సీపీఎం నాయకులు

మంగళగిరి: మంగళగిరి – తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వెంటనే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న కలరా రోగులను సీపీఎం నాయకులు పరామర్శించారు. అనంతరం నేతాజీ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వలన నీటి కాలుష్యంతో డమేరియా, కలరా బారినపడి అనేకమంది పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి ప్రజలకు అత్యవసర వైద్య సేవలందించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో పారిశుద్ధ్యం మెరుగు పరచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం నాయకులు బి.వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ చెంగయ్య, ఎస్.గణేష్, షేక్ కాజా తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ఆప్తమాలజీ పీజీ వైద్యుల ప్రతిభ



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ కంటి వైద్య విభాగం పీజీ వైద్య విద్యార్థులు తమ ప్రతిభా, పాటవాలు చాటి రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. ఆంధ్రప్రదేశ్ ఆప్తాల్మిక్ సొసైటీ గుంటూరు ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 21 వరకు రాష్ట్రస్థాయి కంటి వైద్యుల సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో గుంటూరు వైద్య కళాశాల ఆప్తమాలజీ పీజీ వైద్యులు ప్రథమ స్థానాన్ని సాధించారు. ఈనేపథ్యంలో బుధవారం గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారీ రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి ప్రథమ బహుమతి సాధించిన కంటి వైద్య విభాగం పీజీ విద్యార్థులను అభినందించారు. వారికి ఉత్తమ బోధన అందిస్తున్న కంటి వైద్య విభాగాధిపతి డాక్టర్ రవిబాబు, ప్రొఫెసర్లు, అసోసియేట్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిబాబుతోపాటు, కంటి వైద్యులు సాధన, ఉషాలత, వాణి, శ్రీదేవి, హారిక, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా 'జాతీయ చెస్ చాంపియన్‌షిప్'



చేబ్రోలు: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ – 2025 పోటీల్లో బుధవారం మూడో రౌండ్‌లో సంచలన ఫలితాలు నమోదయ్యాయి. రైల్వేల జీఎం సయంతన్ దాస్‌ను కేవలం 12 ఏళ్ల ఆంధ్ర ప్రతిభావంతుడు అందమాల హేమల్ వర్షన్ ఓడించి సంచలనం సృష్టించాడు. మూడో రౌండ్ ముగిసే సరికి 27మంది ఆటగాళ్లు తలా మూడు పాయింట్లతో అగ్రగాములుగా ఉన్నారు. కేవలం 12 ఏళ్ల హేమల్ వర్షన్ సిసిలియన్ డిఫెన్స్‌లో జీఎం సయంతన్ దాస్‌పై ఘనవిజయం సాధించాడు. రూక్, మైనర్ పీస్ ఎండ్‌గేమ్‌లో రెండు అదనపు పాన్ల ఆధిక్యం సాధించిన హేమల్, నైట్ త్యాగం చేసి పాన్‌ను ఎనిమిదవ వరుసకు ప్రమోట్ చేయడంతో దాస్ రాజీనామా చేశారు. ఆంధ్ర ప్రముఖ ఆటగాడు జీఎం లలిత్ బాబు, ట్రాంపోవ్‌స్కీ ఆరంభంలో వేదాంత్ గార్గ్ (ఛత్తీస్‌గఢ్) పై 45 మూవ్‌లలో గెలిచాడు.

ఎన్నారై కళాశాల వద్ద విద్యార్థుల ఆందోళన



మేడికొండూరు: ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండటం వల్ల మేడికొండూరులోని ఎన్నారై కళాశాల యాజమాన్యం విద్యార్థులను వేధిస్తోందని ఆరోపిస్తూ, బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల వద్ద భారీ ధర్నా జరిగింది. ఫీజులు చెల్లించకపోతే పరీక్ష ఫీజులు కట్టించుకోమని, అలాగే ప్రాక్టికల్ మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవన్ కుమార్, ఎస్.కె. సమీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే ఈ పరిస్థితికి కారణమని మండిపడ్డారు. ఎమ్మెల్సీగా ఉన్న ఆలపాటి రాజా కళాశాల యాజమాన్యంలో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం సమస్యపై స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యపై ఆలపాటి రాజా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వెంటనే స్పందించి విద్యార్థులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి ఎ. యశ్వంత్, జిల్లా గౌడ్స్ కన్వీనర్ సౌమ్య, జిల్లా కమిటీ సభ్యులు అభి తదితరులు పాల్గొన్నారు.

ఇకపై రోబోటిక్ తుంటిమార్పిడి సర్జరీలు

స్ట్రైకర్ సంస్థతో సాయిభాస్కర్ ఆస్పత్రి ఒప్పందం



స్ట్రైకర్ వైస్ ప్రెసిడెంట్ అమన్ రిషితో ఒప్పంద పత్రం మార్చుకుంటున్న డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: ఇప్పటివరకు మోకీలు మార్పిడి సర్జరీలకు మాత్రమే రోబోటిక్ వ్యవస్థను వినియోగిస్తుండగా, ఇకపై తుంటి మార్పిడిలకు కూడా రోబోటిక్ సర్జరీలు చేయనున్నట్లు సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, సీనియర్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి చెప్పారు. అందుకోసం వరల్డ్ క్లాస్ రోబోటిక్ సంస్థ స్ట్రైకర్‌తో ఒప్పందం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. విజయవాడలోని తమ ఆస్పత్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. కోవిడ్ తర్వాత తుంటి కీలు అరుగుదలపై తీవ్ర ప్రభావం చూపి, చిన్న వయస్సులోనే తుంటి మార్పిడి శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తుందన్నారు. రోబోటిక్ వ్యవస్థతో రోగికి మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఏపీలోనే మొదటిసారిగా తుంటి మార్పిడి ఆపరేషన్లలో మాకొ హిప్ అండ్ సీ రోబోటిక్‌ను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. అక్టోబర్ నుంచి తమ ఆస్పత్రిలో రోబోటిక్ తుండి మార్పిడి ఆపరేషన్లు అందుబాటులోకి వస్తాయన్నారు.

అతివృష్టితో అపర నష్టం!

- అపరాల పంటలు వర్షార్పణం
- నిండా మునిగిన రైతులు
- పత్తి, జ్యూట్ పంటలకు పొంచిఉన్న ముప్పు



అపరాల పొలాల్లో చేరిన వర్షం నీరు

తాడికొండ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు కుదేలవుతున్నారు. మబ్బుకు చిల్లుపడిందా అన్న చందంగా ప్రతి రోజు వాన కురుస్తుండటంతో రైతన్నలు పంట పొలాల్లో అడుగు పెట్టేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే అరకొరగా సాగుచేసిన అపరాల పంటలు వర్షార్పణం కాగా పత్తి పంట ఎదుగుదల లేక ఎర్రబారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక జ్యూట్ పంట పరిస్థితి కూడా ఇదేవిధంగా మారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా పొలంలోకి అడుగు పెట్టి అంతర కృషి చేసే పరిస్థితి కూడా లేని కారణంగా పై పాటుగా మందుల పిచికారీ కలుపు ఏరివేత కూడా చేయలేని పరిస్థితితో పొలాలు పిచ్చి కంపల్లా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుండె 'చెరువు' అయింది!

ఈ ఏడాది నెలకొన్న అతివృష్టి పరిస్థితుల కారణంగా ఇప్పటి వరకు పెట్టుబడుల రూపంలో పెట్టిన సొమ్ము అయినా తిరిగొస్తుందా లేదా అనే బెంగ అన్నదాతల్లో పట్టుకుంది. కొండవీటి వాగు ఉధృతికి తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు గత రెండు నెలలుగా నానుతున్నాయి. పంటనష్టం పరిహారం అంచనాలు రూపొందించి అన్నదాతకు అండగా నిలవాల్సిన వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా యత్నించిన దాఖలాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు యూరియా సరఫరా లేక ప్రభుత్వం చేతులెత్తేయగా.. అధిక ధరలు వెచ్చించి కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేసి పెట్టుబడులు పెట్టామని, తీరా ఇప్పుడు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొండవీటి వాగు ముంపునకు గురైన రైతులకు న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నీట మునిగిన జ్యూట్ పైరు




తాడికొండ – నీరుకొండ మధ్య పంట పొలాలకు వెళ్లే రహదారిపై పడిన భారీ గండి



'పాజిటివ్ థింకింగ్'కు పాజిటివ్-సెల్ఫ్‌టాక్ అనేది మంచి ఫలితాన్ని ఇస్తుంది. ప్రతిరోజు మీకు వచ్చిన ఆలోచనలను గుర్తు తెచ్చుకొని పాజిటివ్, నెగెటివ్ ఆలోచనల లెక్క తేల్చుకోవాలి. ఇలా ఏ రోజుకు ఆ రోజుకు గుర్తు తెచ్చుకోవడం వల్ల మరుసటి రోజు ప్రతికూల ఆలోచనలు రాకుండా జాగ్రత్త పడవచ్చు.

● నవరాత్రి



ఫాల్గుణి పాఠక్

దసరా నవరాత్రులు వస్తే దేశం తలిచే పేరు ఫాల్గుణి పాఠక్. 'దాండియా క్వీన్ ఆఫ్ ఇండియా'గా పేరు గడించిన ఈ 56 సంవత్సరాల గాయని తన పాటలతో, నృత్యాలతో పండగ శోభను తీసుకువస్తుంది. 25 రూపాయల పారితోషికంతో జీవితాన్ని ప్రారంభించి నేడు కోట్ల రూపాయలను డిమాండ్ చేయగల స్థితికి చేరిన ఫాల్గుణి స్ఫూర్తి పై పండుగ కథనం.

ఆమె దాండియాకి ఇండియా నర్తిస్తుంది

దేశంలో దసరా నవరాత్రులు జరుపుకుంటారు.

కాని అమెరికాలో, దుబాయ్‌లో, గుజరాతీలు ఉండే అనేక దేశాల్లో వీలును బట్టి ప్రీ దసరా, పోస్ట్ దసరా వేడుకలు కూడా జరుపుకుంటారు.

ఫాల్గుణి పాఠక్ వీలును బట్టి ఇవి ప్లాన్ అవుతాయి. ఆమె దసరా నవరాత్రుల్లో ఇండియాలో ఉంటే దసరా అయ్యాక కొన్ని దేశాల్లో దాండియా డాన్స్‌షోలు నిర్వహిస్తారు. లేదా దసరాకు ముందే కొన్ని దేశాల్లో డాన్స్ షోలు నిర్వహిస్తారు. ఆమె దసరాకు ముందు వచ్చినా, తర్వాత వచ్చినా కూడా ప్రేక్షకులకు ఇష్టమే. ఆమె పాటకు పాదం కలపడం కోసం అలా లక్షలాది మంది ఎదురు చూస్తూ ఉంటారు.

అంతటి డిమాంట్ ఉన్న గాయని ఫాల్గుణి పాఠక్ మాత్రమే.

తండ్రిని ఎదిరించి...

ఫాల్గుణి పాఠక్‌ది తన రెక్కలు తాను సాచ గల ధైర్యం. నలుగురు కూతుళ్ల తర్వాత ఐదవ కూతురుగా ముంబై లోని ఒక గుజరాతి కుటుంబంలో జన్మించింది ఫాల్గుణి. నలుగురు కూతుళ్ల తర్వాత ఐదవ సంతానమైనా అబ్బాయి పుడతాడని భావిస్తే ఫాల్గుణి పుట్టింది. అందుకే తల్లి, నలుగురు అక్కలు ఆమెకు ప్యాంటు, షర్టు తొడిగి అబ్బాయిలా భావించి ముచ్చట పడేవారు. రాను రాను ఆ బట్టలే ఆమెకు కంఫర్ట్‌గా మారాయి. వయసు వచ్చే సమయంలో తల్లి హితవు చెప్పి, అమ్మాయిలా ఉండమని చెప్పినా ఫాల్గుణి మార లేదు. ఆ ఆహార్యం ఒక తిరుగుబాటైతే పాట కోసం తండ్రిని ఎదిరించడం మరో తిరుగుబాటు. తల్లి దగ్గరా, రేడియో వింటూ పాట నేర్చుకున్న ఫాల్గుణి పాఠక్ స్కూల్లో పాడుతూ ఎనిమిదో తరగతిలో ఉండగా మ్యూజిక్ టీచర్‌తో కలిసి ముంబైలోని వాయుసేన వేడుకలో పాడింది. ఆమె పాడిన పాట 'ఖుర్బానీ' సినిమాలోని 'లైలా ఓ లైలా'. అది అందరినీ అలరించిందిగానీ ఇంటికి వచ్చాక తండ్రి బావబాదాడు.. పాటలేంటి అని. కాని అప్పటికే పాటలో ఉండే మజా ఆమె తలకు ఎక్కింది. ఆ తర్వాత తరచూ ప్రదర్శనలు ఇవ్వడం ఇంటికి వచ్చి తండ్రి చేత దెబ్బలు తినడం... చివరకు విసిగి తండ్రి వదిలేశాడుగాని ఫాల్గుణి మాత్రం పాట మానలేదు.

తండ్రితోనే

ఏ తండ్రైతే ఆమెను పాడవద్దన్నాడో ఆ తండ్రికి తనే ఆధారమైంది ఫాల్గుణి. ఆమెకు 15 ఏళ్ల వయసులోనే తల్లి హార్ట్ ఎటాక్‌తో మరణించడంతో కుటుంబ భారం తనే మోసి ఇద్దరు అక్కల పెళ్లిళ్లు తనే చేసింది. తండ్రిని చూసుకుంది. వివాహం చేసుకోవడానికి ఇష్టపడని ఫాల్గుణి 'నేను నాలాగే హాయిగా ఉన్నాను' అంటుంది. గత 25 ఏళ్లుగా 30 మంది సభ్యుల బృందం స్థిరంగా ఆమె వెంట ఉంది. ప్రతి ప్రదర్శనలో వీరు ఉంటారు. వీరే నా కుటుంబం అంటుందామె.

త-థయ్యా బ్యాండ్

తన ప్రదర్శనలతో పాపులర్ అయ్యాక సొంత బ్యాండ్ స్థాపించింది ఫాల్గుణి. దాని పేరు 'త-థయ్యా'. ఆ బ్యాండ్‌తో దేశంలోని అన్నిచోట్లా నవరాత్రి షోస్ మొదలెట్టింది. నవరాత్రి ఉత్సవాల్లో దాండియా, గర్బా డాన్స్ చేసే ఆనవాయితీ ఉత్తరాదిలో ఉంది. ఫాల్గుణికి ముందు ప్రదర్శనలిచ్చేవారు కేవలం ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్‌ను మాత్రమే వినిపిస్తూ డాన్స్ చేసేవారు. ఫాల్గుణి తనే దాండియా, గర్బా నృత్యాలకు వీలైన పాటలు పాడుతూ ప్రదర్శనకు హుషారు తేసాగింది. దాండియా సమయంలో ఎలాంటి పాటలు పాడాలో, జనంలో ఎలా జోష్ నింపాలో ఆమెకు తెలిసినట్టుగా ఎవరికీ తెలియదు. అందుకే ఆమె షోస్ అంటే జనం విరగబడేవారు. 2010లో మొదటిసారి నవరాత్రి సమయాల్లో ఆమె గుజరాత్ టూర్ చేసినప్పుడు ప్రతిరోజూ 60 వేల మంది గుజరాత్ నలుమూలల నుంచి ఆమె షోస్‌కు హాజరయ్యేవారు.

ప్రయివేట్ ఆల్బమ్స్

స్టేజ్ షోలతో పాపులర్ అయిన ఫాల్గుణి తొలిసారి 1998లో తెచ్చి 'యాద్ పియాకీ ఆనె లగీ'... పేరుతో విడుదల చేసిన ప్రయివేట్ ఆల్బమ్ సంచలనం సృష్టించింది. ఊరు, వాడ 'యాద్ పియాకీ ఆనె లగీ' పాట మార్మోగిపోయింది. యువతరం హాట్ ఫేవరెట్‌గా మారింది. 1999లో విడుదల చేసిన 'మైనె పాయల్ హై ఛన్‌కాయ్'... కూడా పెద్ద హిట్. ఈ ఆల్బమ్స్‌లో పాటలు కూడా ఆమె తన నవరాత్రుల షోస్‌లో పాడటం వల్ల ఆమెకు విపరీతమైన క్రేజ్ వచ్చింది.

రోజుకు 70 లక్షలు

2013 సమయానికి ఫాల్గుణి పాఠక్ నవరాత్రి డిమాండ్ ఎంత పెరిగిందంటే రోజుకు 70 లక్షలు ఆఫర్ చేసే వరకూ వెళ్లింది. నవరాత్రుల మొత్తానికి 2కోట్ల ఆఫర్ కూడా ఇవ్వసాగారు. ఆశ్చర్యం ఏమిటంటే నవరాత్రుల్లో అందరూ సంప్రదాయ దుస్తులు ధరించి దాండియా, గర్బా నృత్యాలు చేస్తారు. కాని ఫాల్గుణి ఆ దుస్తులు ఏవీ ధరించదు. ప్యాంట్ షర్ట్ మీదే ప్రదర్శనలు ఇస్తుంది. 'ఒకసారి ఘాగ్రా చోళీ వేసుకొని షో చేశాను. జనం కింద నుంచి ఇలా వద్దు నీలాగే బాగుంటావు అని కేకలు వేశారు. ఇక మానేశాను' అంటుందామె.

వెలుగులు చిమ్మాలి

ఫాల్గుణి ప్రదర్శన అంటే స్టేజ్ మాత్రమే కాదు గ్రౌండ్ అంతా వెలుగులు చిమ్మాలి. గ్రౌండ్‌లోని ఆఖరు వ్యక్తి కూడా వెలుతురులో పరవశించి ఆడాలని భావిస్తుంది ఫాల్గుణి. ప్రతి నవరాత్రి ప్రదర్శన సమయంలో నిష్ఠను పాటించి పాడుతుందామె. 'నేను ఇందుకోసమే పుట్టాను. నాకు ఇది మాత్రమే వచ్చు' అంటుంది. ఆమెకు విమాన ప్రయాణం అంటే చాలా భయం. 'విమానం ఎక్కినప్పటి నుంచి హనుమాన్ చాలీసా చదువుతూ కూచుంటాను. అస్సలు నిద్ర పోను' అంటుందామె. హనుమాన్ చాలీసా ఇచ్చే ధైర్యంతో ప్రపంచంలోని అన్ని మూలలకు ఆమె ఎగురుతూ భారతీయ గాన, నృత్యాలకు ప్రచారం కల్పిస్తోంది.

నవశక్తి

అమ్మ స్ఫూర్తి..

'మనలో శక్తి ఎంత ఉందో నడిచి వచ్చిన మన మార్గమే చూపుతుంది' అంటారు డాక్టర్ సాయిలత. కర్ణాటకలోని హోస్పేట్‌లో డాక్టర్‌గా పని చేస్తున్న సాయిలత కర్నూలు వాసి.
ఒంటరిగా తల్లి పడుతున్న కష్టాన్ని అర్థం చేసుకుంటూ, ఆర్థిక స్థోమత లేకపోయినా పెద్ద కలను నెరవేర్చుకునే ప్రయత్నంలో పట్టుదలతో కృషి చేసి డాక్టర్‌గా ఎదిగారు. సేవామార్గాన్నీ వదలకుండా అమ్మాయిల ఆరోగ్య జీవన విధానానికి, విద్యార్థులకు చెప్పాల్సిన విషయాల్లో బోధకురాలిగా తన జీవన ప్రయాణాన్ని మెరుగ్గా మలుచుకున్నారు. ఆ వివరాలు సాయిలత మాటల్లోనే...

"ఈ రోజు గైనకాలజిస్ట్‌గా సేవలందించే స్థాయికి రావడం అంత సులువుగా కాలేదు. నేను పుట్టి పెరిగింది కర్నూలులో. సింగిల్ మదర్‌గా మా అమ్మ నన్నూ చెల్లెలిని పోషించడానికి చాలా కష్టపడేది. రిసెప్షనిస్ట్‌గా, గోడౌన్ ఇన్‌చార్జిగా.... చిన్న చిన్న ప్రైవేట్ జాబులు చేస్తూ ఉండేది. అమ్మ కష్టం చూస్తుంటే చాలా బాధ అనిపించేది. కానీ, నాకేమో డాక్టర్ అవాలని కల. అమ్మ నా ఆలోచనను నిరుత్సాహపరచలేదు.

'అభయం'తో...

టెన్త్‌లో మంచి మార్కులు వచ్చాయి. మేం పెద్దవుతుంటే ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. కాలేజీ ఫీజులు కట్టే స్తోమత లేదు. ఇప్పుడెలా... అనుకుంటున్నప్పుడు హైదరాబాద్‌లో ఉన్న 'అభయ' స్వచ్ఛంద సంస్థ గురించి తెలిసింది. వాళ్లను కలిస్తే, ఫీజులకు సాయం చేశారు. ఆ తర్వాత ఎమ్‌సెట్ రాస్తే వచ్చిన ర్యాంకుకు రిజర్వేషన్లు లేకపోవడం వల్ల సీటు రాలేదు. దాంతో లాంగ్ టర్మ్ కోచింగ్‌కి సాయం కోసం వెతుకుతుండగా ఈ విషయం తెలిసి, అభయ ఫౌండేషన్ వాళ్లే పిలిపించి మరీ లాంగ్ టర్మ్ కోచింగ్‌కు సాయం చేశారు. ఆ యేడాది మంచి ర్యాంకు తెచ్చుకున్నాను. అనంతపూర్ మెడికల్ కాలేజీలో ఫ్రీ సీటు వచ్చింది. ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఆ తర్వాత పీజీ కోర్సుకు ఏడాది కోచింగ్ తీసుకున్నాను. ఆలిండియా నీట్‌లో ర్యాంకు వచ్చింది.



ప్రసూతి వైద్య నిపుణురాలిగా డా సాయిలత

మహారాష్ట్ర అకోలా మెడికల్ కాలేజీలో పీజీ పూర్తి చేశాను. స్కాలర్‌షిప్స్ వచ్చాయి. సంస్థ నుంచి సాయం అందింది. నా క్లాస్‌మేట్, పీడియాట్రిషియన్ డాక్టర్ తిరుమలేశ్‌తో నా పెళ్లి జరిగింది. మా అత్తగారిది కర్ణాటకలోని హోస్పేట్. దాంతో మేమిద్దరం కలిసి, అక్కడే క్లినిక్ నడుపుతున్నాం. పండక్కి హైదరాబాద్‌లో ఉంటున్న అమ్మ లక్ష్మి, చెల్లెలు ధరణిల వద్దకు వచ్చాను. మాకోసం ఎంతో కష్టపడిన అమ్మకు విశ్రాంతి కల్పించాను.

సేవా మార్గం...

ఉంటున్న చోటనే డాక్టర్‌గా వృత్తిని కొనసాగిస్తూ, గర్ల్ సేఫ్టీ గురించి అవగాహనా తరగతులు తీసుకుంటున్నాను. నెలసరి సమయంలో ఎలా ఉండాలి, రక్తహీనత, థైరాయిడ్, అధికబరువు, గర్భధారణ.. ఇలా చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు మహిళల్లో ఉండే ఆరోగ్య సమస్యలు, వాటిపైన సెషన్స్ చెబుతూనే ఆన్‌లైన్ ద్వారా స్టూడెంట్స్‌కు ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం మొదలైన విషయాలపైనా గైడెన్స్ ఇస్తుంటాను. ప్రైమరీ, ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి, అమ్మాయిలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరిస్తుంటాను. ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంచుకోవాలి, అమ్మాయిల రక్షణకు సంబంధించిన విషయాలు నృత్య, నాటకాల ద్వారా చెబుతుంటాను 'అభయ' వల్ల నా జీవితానికి మార్గం ఏర్పడింది. అందుకు నా వంతుగా తిరిగి ఆ సంస్థకు ఉన్న 30 సెంటర్లలోని టీచర్లకు గైడెన్స్ ఇస్తుంటాను. హెల్త్ క్యాంపుల్లో ఉచిత సేవలు అందిస్తుంటాను.

నాలుగు గోడల మధ్య ఏమీ తెలియని ప్రపంచం నుంచి బయల్దేరిన నాకు ఈ రోజు కొన్ని వందలమందికి అవగాహన కలిగించే స్థాయి లభించింది. ఈ ప్రయాణంలో అమ్మ కష్టం, అభయ అందించిన సాయం నన్ను నిలబెట్టాయి. అవకాశాలు వచ్చినప్పుడు అందిపుచ్చుకోవడంతో పాటు, వాటిని సరిగ్గా సద్వినియోగం చేసుకోవాలన్నది నా జీవన ప్రయాణం నేర్పిన పాఠం. శక్తి మనలో ఉందని గుర్తిస్తే ఎదగడానికి మద్దతు కూడా లభిస్తుంది. ప్రయాణంలో మనకు శక్తిగా నిలిచినవారికి తిరిగి మన శక్తిని అందించినప్పుడు ఆ ఆనందం గొప్పగా ఉంటుంది" అని వివరించారు ఈ డాక్టర్.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

కళకు సృజనకు కొలువు

దేవీ శరన్నవరాత్రులంటే దేవీ పూజ, అలంకారాలు, నైవేద్యాలు మాత్రమే కాదు. కన్నుల పండుగైన బొమ్మల కొలువులు కూడా. దసరాపండుగ సందర్భంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేయడం దక్షిణ భారత రాష్ట్రాల్లో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్నాటక, తమిళనాడులలో సంప్రదాయం..

దుర్గాదేవి రాక్షసులతో తలపడి వారిపై సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండగ జరుపుకుంటున్నాం. అందులో భాగంగా పెట్టుకునే ఈ బొమ్మల కొలువులు సాధారణంగా ఇళ్లలోనే ఏర్పాటు చేస్తారు. కొన్నిచోట్ల ఆలయాల్లో కూడా అలంకరిస్తారు. ఈ బొమ్మల కొలువు ఏర్పాట్లు, ఆ అలంకరణ హడావిడంతా ప్రధానంగా అమ్మాయిలు, అమ్మలదే అయితే, తండ్రులు, అన్నదమ్ములు వారికి కావలసిన బొమ్మలను సమకూర్చే బాధ్యతను తీసుకుంటారు.

ఎవరి ప్రాంతాలలో, ఇళ్లల్లో ఆచారాన్ని, అలవాటును బట్టి వారు సంక్రాంతికి అయితే సంక్రాంతికి, దసరాకు అయితే దసరాకూ బొమ్మల కొలువు పెడుతుంటారు. సాధారణంగా దసరా బొమ్మల కొలువుకు అమ్మవార్లను, సంక్రాంతి బొమ్మల కొలువులో శివకేశవులకు సంబంధించిన బొమ్మలనూ ఎక్కువగా అలంకరిస్తారు. అది కేవలం ఒక వేడుక మాత్రమే.

పిల్లల ఉల్లాసం.. ఉత్సాహం

పిల్లల ఆనందం, ఉత్సాహాల కోసం తీర్చిదిద్దే ఈ అమరికలోనే వారి కళానైపుణ్యం, సృజన బయట పడతాయి. బొమ్మల కొలువులో తొమ్మిది మెట్లుంటాయి.

మెట్లపై తెల్లని వస్త్రం పరచి ఆ పై బొమ్మలను అమర్చుతారు. ఎవరెవరి కళాత్మక దృష్టి, ఆర్థిక స్తోమత, అవసరాలు, కోరికలు, మొక్కుబడులు, సౌకర్యాలకు అనుగుణంగా వాళ్ళు ఈ మెట్లపై రకరకాల బొమ్మలను అమరుస్తారు. పై మెట్లపై దేవుళ్ళ బొమ్మలను ఉంచుతారు. కింద వున్న మెట్లు పై ప్రాపంచిక జీవితానికి సంబంధించిన బొమ్మలు వుంచుతారు. అవి తామస గుణాన్ని ప్రతిబింబిస్తాయని అంటారు. మధ్య భాగంలో క్షత్రియధర్మాన్ని తెలుపుతూ ఉండే రాజు, రాణి, యుద్ధవీరుల వంటి బొమ్మలను ఉంచుతారు. ఇక అన్నిటికన్నా పై మెట్టు మీద వుంచే కలశాన్ని సంపదకు, అమ్మవారి ఆశీరనుగ్రహాలకూ సూచనగా భావిస్తారు. ఇదీ బొమ్మలకొలువు తత్వం.

విశేషాలు

దీప ధూప నైవేద్యాలతో ప్రతిరోజూ లలితా సహస్రనామాలు, లక్ష్మీ అష్టోత్తరం చదివి పూజలు చేస్తారు. రోజూ ఒక కన్యకి (చిన్నఅమ్మాయి), ఒక సువాసినికి నవకాయ పిండివంటలతో భోజనం పెట్టి తాంబూలం, అలంకరణ వస్తువులు, బట్టలు ఇస్తారు. కొందరు ఇలా దసరా తొమ్మిదిరోజులు, కొందరు మూడు రోజులూ చేస్తారు. బంధుమిత్రులను, పిల్లలను సాయంత్రం పేరంటానికి పిలిచి, అందరికీ పసుపు – కుంకుమ, తాంబూలం, దక్షిణ ఇస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, అమ్మవారి అనుగ్రహం కలుగుతుందని విశ్వాసం. బొమ్మల కొలువుకు పాత బొమ్మలే వాడినా, ప్రతి సంవత్సరం తప్పనిసరిగా ఓ కొత్తబొమ్మ కొనడం సంప్రదాయం.



మీరు బొమ్మల కొలువు పెట్టారా?

దసరాకు మీరు బొమ్మల కొలువు పెట్టారా? అయితే ఆ బొమ్మల కొలువుతో ఒక సెల్ఫీ తీసుకుని ఊరు, పేరు రాసి ఈ కింది చిరునామాకు మెయిల్ చేయండి. బాగున్న వాటిని ఫ్యామిలీలో ప్రచురిస్తాం.
sakshibommalakoluvu@gmail.com

పెద్దలే దగ్గరుండి...

ముందే చెప్పుకున్నట్లుగా బొమ్మల కొలువు అన్నది వారి వారి ఆర్థిక స్తోమత, సృజనాత్మకత, కళాత్మకతల ఆధారంగా ఏర్పాటు చేస్తుంటారు. వీటిని సాధారణంగా పెద్దవాళ్లు దగ్గరుండి పిల్లల చేత చేయిస్తుంటారు. కొందరు బొమ్మల కొలువు కోసం బంక మట్టితో అమ్మవార్ల ప్రతిమలను తయారు చేసి, వాటికి రంగులద్ది రకరకాల పూసలతో రూపొందించిన ఆభరణాలను అలంకరిస్తుంటారు.

సెలవులలో పిల్లలను పెద్దవాళ్లు ఇటువంటి వాటి దిశగా ప్రోత్సహిస్తే వారిలో భక్తి శ్రద్ధలతో బాటు ఏకాగ్రత కూడా పెరుగుతుంది. ఫలితంగా చదువుపైన కూడా ఆసక్తి కలుగుతుందనడంలో సందేహం లేదు.

– డి.వి.ఆర్.

● సోషల్ మీడియా

లక లక లక... గ్రామ సింహాల కళ!





'చంద్రముఖి' సినిమాలో 'లక లకలక' అంటూ శునకాలతో రజినీకాంత్ వచ్చే దృశ్యంలో రాజసం ఉట్టిపడుతుంది. రాజసం ఉట్టిపడే మాట ఎలా ఉన్నా, ఈ వీడియో మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అయింది. బెంగళూరులోని ఆర్‌టీ నగర్‌లో ఒక మహిళ 28 గోల్డెన్ రిట్రీవర్స్(శునకాలు)తో వీధుల వెంట తిరిగింది.

ఈ వీడియో క్లిప్‌ను...

'28 డాగ్స్, 1 బిగ్ హార్ట్, మీట్ ది డాగ్ లవర్ ఆంటీ' కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

'మనుషులను నమ్ముకోవడం కంటే ఇలా శునకాలను నమ్ముకొని బయటకు రావడం మేలు'

'దయాగుణం, విశ్వాసం...రెండూ కలిసి నడుస్తున్నట్లుగా ఉంది'

'శునకాలతో కాదు సింహాలతో తిరుగుతున్నట్లుగానే ఉంది'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.

● మన(సు)లో మాట

ఈ ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాను!

నా వయసు 32 సంవత్సరాలు. నేను ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నాను. ఉదయం 9 నుంచి సాయంత్రం 7 వరకు పని ఉంటుంది. ఇంటికి వచ్చాక వంట, పిల్లాడి హోంవర్కు, ఇల్లు చూసుకోవడం అన్నీ నామీదే పడతాయి. నా భర్త కూడా ఇంకో ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగి. ఇంటి పనుల్లో అసలు సహాయం చేయడు. దీనివల్ల నాకు ఎప్పుడూ అలసటగా, చిరాకుగా అనిపిస్తుంటుంది. దీనికితోడు నాభర్త, అత్తమామలు ఇప్పుడు ఇంకో బిడ్డ కావాలని వత్తిడి చేస్తున్నారు. బ్యాంక్ పనిలో వత్తిడి, అత్త మామల విమర్శలు, భర్త సపోర్ట్ లేకపోవడం... ఇలా వీటన్నిటి మధ్య చాలా అశాంతికి లోనవుతున్నాను. మీరే ఏదైనా మంచి సలహా ఇస్తారని ఆశిస్తున్నాను.

– దీపిక, నిజామాబాద్

మీది మన సమాజంలో చాలామంది మహిళలు ఎదుర్కొనే పరిస్థితే! పని, ఇల్లు రెండూ ఒంటరిగా మేనేజ్ చేయడం వల్ల అలసట, చిరాకు రావడం సహజం. అందుకే ముందుగా మీ భర్తతో ఓపిగ్గా మాట్లాడి అతను కూడా ఇంటి పనులు పంచుకోవడం అవసరమని చెప్పండి. చిన్న చిన్న పనులలో అయినా సరే అతను చేసే సహాయం మీ అలసటను తగ్గించడమే కాకుండా మీ మధ్య బంధాన్ని మరింత దృఢం చేస్తుందని అతనికి అర్థం అయ్యేలా వివరించండి. మీ అత్తమామలు, భర్త, ఇంకో పిల్లాడు కావాలని వత్తిడి తెస్తున్నారని చెప్పారు. పిల్లల విషయం అనేది మీరు, మీ భర్త కలిసి తీసుకోవాల్సిన నిర్ణయమే తప్ప మీ అత్త మామలు నిర్ణయించే విషయం కాదని మీ ఆయనకి నచ్చ చెప్పండి. మీరు మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా సిద్ధం కాకపోతే కేవలం వాళ్ళ వత్తిడి మీద నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదు. కొంత కాలం మీ అత్త మామలని మీ ఇంట్లోనే ఉండమని మీ బాబును చూసుకోవడంలో, ఇంట్లో పనుల్లో సహాయం చేయమని అడగండి. వాళ్ళు అందుకు ఒప్పుకుంటే అప్పుడు రెండో పిల్లాడి గురించి ఆలోచించవచ్చు. ఉద్యోగం, కుటుంబం రెండూ కలిపి నడపడం కష్టం అయినా, అసాధ్యం అయితే కాదు! ఇంట్లో పనుల కోసం పని వాళ్ళని ఏర్పాటు చేసుకోండి. ఆఫీస్ లో కూడా అన్ని పనులు మీ నెత్తిమీద వేసుకోకుండా మిగిలిన మీ వారికి కూడా డెలిగేట్ చేయడం నేర్చుకోండి. అలాగే మీకోసం రోజుకు కొంచెం సమయం కేటాయించండి.. కాసేపు నడక, ధ్యానం, సంగీతం, లేదా మీకు ఇష్టమైన పనులు చేస్తూ రిలాక్స్ అవ్వండి. వర్క్, పర్సనల్, ఫ్యామిలీ లైఫ్‌ను, జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకుంటూ వెళ్తే, మీ వత్తిడి క్రమేణా తగ్గుతుంది. కావాలంటే మీ దంపతులు ఇతర కుటుంబ సభ్యులతో కలసి ఒకసారి కౌన్సెలింగ్‌కి వెళ్తే కౌన్సిలర్స్ మీకు సరైన నిర్ణయం తీసుకునేందుకు సహాయం చేస్తారు. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

● బ్యూటిప్



కాళ్ల పగుళ్ల నివారణకు...

అర కప్పు కొబ్బరి నూనెలో కొద్దిగా వేపాకు, పావు టీ స్పూన్ పసుపు, కొద్దిగా కర్పూరం వేసి కాచాలి. చల్లారిన తరవాత వడకట్టి, ఆ నూనెను రాత్రి పడుకునే ముందు కాళ్ల పగుళ్ల మీద అప్లై చేయాలి. రెండు నిమిషాలు మర్దనా చేస్తే ఉపశమనం ఉంటుంది.

నునుపయిన చేతులకోసం...

ఉడకబెట్టిన బంగాళదుంప గుజ్జుతో చేతుల మీద అయిదు నిమిషాలు రుద్ది చన్నీటితో కడిగేయాలి. వారంలో ఒకసారి ఈవిధంగా చేస్తే చేతులు నునుపవుతాయి.

సమ్‌థింగ్ స్పెషల్

75 రోజుల దసరా!



డెబ్బై అయిదు రోజుల పాటు జరిగే దసరా పండగ ప్రాచీన సంప్రదాయం ఇప్పటికీ బస్తర్‌లో కొనసాగుతోంది. 'జోగీ బిథాయి' సంప్రదాయంలో భాగంగా హల్బా తెగకు చెందిన ఒక యువకుడు సాధువు వేషధారణతో దంతేశ్వరీ ఆలయంలో భూమికి ఆరు అడుగుల దిగువన, జ్యోతి ఎదురుగా తొమ్మిది రోజుల పాటు పీఠంపై కూర్చుంటాడు. ఈ యువకుడు ఎనిమిది రోజులు ఉపవాసం ఉంటాడు.

'జోగి బిథాయి' సంప్రదాయానికి 600 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇందులో పాత్ జత్ర, దేరి గడాయి, కాంచన గడాయి సంప్రదాయాలు ఉంటాయి. మవల్లి ఆలయంలో పూజారి దీపం వెలిగించడంతో దసరా ఉత్సవాలు మొదలవుతాయి. ఒక ఖడ్గాన్ని ఆలయంలో పెట్టి పూజలు చేస్తారు. ఈ పురాతన సంప్రదాయాన్ని ఇటలీకి చెందిన ఇద్దరు యువకులు డాక్యుమెంట్ చేశారు.

'ఇక్కడి ప్రజలు నిరాడంబరంగా, స్నేహంగా ఉంటారు. ఇక్కడ దసరా పండగ రకరకాల సంప్రదాయలతో కన్నుల పండుగగా జరుగుతుంది' అంటున్నాడు 'జోగి బిథాయి' సంద్రాయాన్ని వీడియో డాక్యుమెంట్ చేసిన యువకులలో ఒకరైన డేనియల్.

ప్రపంచంలో జరిగే అతి పెద్ద దసరా వేడుకలలో 'జోగి బిథాయి'కి ప్రత్యేక గుర్తింపు ఉంది.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 24న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,19,210	బంగారం (24 క్యారెట్లు)	1,17,340	బంగారం (24 క్యారెట్లు)	1,15,370	బంగారం (24 క్యారెట్లు)	1,17,340	బంగారం (24 క్యారెట్లు)	1,18,700	బంగారం (24 క్యారెట్లు)	1,15,630
బంగారం (22 క్యారెట్లు)	1,12,760	బంగారం (22 క్యారెట్లు)	1,05750	బంగారం (22 క్యారెట్లు)	1,05,750	బంగారం (22 క్యారెట్లు)	1,08,920	బంగారం (22 క్యారెట్లు)	1,09,200	బంగారం (22 క్యారెట్లు)	1,06,000
వెండి	1,43,000	వెండి	1,39,000	వెండి	1,50,000	వెండి	1,39,000	వెండి	1,39,900	వెండి	1,50,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.